క్లుప్తంగా

నల్లపాడులో రాజన్న చలివేంద్రం



గుంటూరు రూరల్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరుతో రాజన్న చలివేంద్రాన్ని ఏర్పాటు చేయటం సంతోషకరమని సమాజ చైతన్య సంఘం అధ్యక్షుడు పరిశుద్ధరావు తెలిపారు. శుక్రవారం నల్లపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో సంఘం ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే సందర్భంగా మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ, రాజన్న చలివేంద్రం ప్రారంభించారు. వేసవిలో ప్రయాణికులు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఇది మంచి కార్యక్రమమన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ, సురేష్, చైతన్య, శ్రీనివాసరావు, జి.జయరావు తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ ఉద్యమానికి స్టాలిన్ నాయకత్వం అభినందనీయం

నెహ్రూనగర్: ఓబీసీ కులాల గణంకాల సేకరణ కోరుతూ దేశవ్యాప్తంగా చేపడుతున్న ఉద్యమంలో తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కీలకపాత్ర పోషించడం అభినందనీయమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల న్యూఢిల్లీలో కాంగ్రెస్ సహా బీజేపీ యేతర పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించిన స్టాలిన్ ఓబీసీ గణాంకాల్ని సేకరించాల్సిందేనని, లేదంటే అసలు జనాభా గణననే బహిష్కరించాలనే తరహాలో కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేయడం సమంజసమేనని పేర్కొన్నారు. నిజంగా బీజేపీకి బీసీలపై చిత్తశుద్ధి ఉంటే తక్షణం కులాల గణాంకాలు సేకరించడానికి ఉత్తర్వులు జారీ చేయాలని శంకరరావు డిమాండ్ చేశారు.

10న పూలే విగ్రహాల ఏర్పాటుపై సదస్సు



పాత గుంటూరు: వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ నెల 10న మహాత్మా జ్యోతిరావ్ పూలే, సావిత్రీబాయి పూలే దంపతుల విగ్రహాల ఏర్పాటుపై సన్నాహక సదస్సు నిర్వహిస్తున్నట్లు సాధన సమితి కన్వీనర్ వై. కోటేశ్వరరావు తెలిపారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని మున్సిపల్ బంగ్లా సర్కిల్‌లో ఐలాండ్ నిర్మించి, పూలే దంపతుల విగ్రహాలను ఒకే చోట ఆవిష్కరించి పూలే సర్కిల్‌గా నామకరణం చేయాలని కోరుతూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు సభ జరుగుతుందని, నగర ప్రజలంతా పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో సమితి సభ్యులు దొంతా సురేష్, ఉగ్గం సాంబశివరావు, బత్తుల వీరాస్వామి, గంటి ప్రభుదాస్, చిరతనగండ్ల వాసు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లోనూ పని చేయనున్న క్యాష్ కౌంటర్లు



నెహ్రూనగర్: 2023–24 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆస్తి పన్ను ఏక మొత్తంలో చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. పన్ను చెల్లించేందుకు గానూ నగరపాలక సంస్థ క్యాష్ కౌంటర్లు సెలవు రోజుల్లోనూ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేస్తాయని పేర్కొన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. డిమాండ్ నోటీసు కోసం వేచి చూడకుండా అసెస్‌మెంట్ నంబర్‌తో నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని హెల్ప్ డెస్క్‌లో సంప్రదించి, పన్ను చెల్లించి రాయితీ పొందాలని సూచించారు.

సీనియర్ న్యాయవాది పాండురంగ మృతి



గుంటూరు లీగల్: గుంటూరు బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది ఇబ్బూరి పాండురంగ శుక్రవారం ఉదయం మృతి చెందారు. నగరంలోని రామిరెడ్డినగర్‌లో నివాసం ఉండే ఆయన ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైయ్యారు. ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ మృతి చెందారు. శనివారం ఉదయం 10 గంటలకు అంతిమయాత్ర నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పాండురంగ మృతికి పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు సంతాపం తెలిపారు.

సంక్షేమ పథకాలతో.. ప్రజల్లో సంతోషం

- 'జగనన్నే మా భవిష్యత్తు' అని అంటున్నారు.
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి ప్రచారాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, నాయకులు

గుంటూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు తమ పిల్లల చదువుకు, కుటుంబ పోషణకు ఎంతో ఉపయోగపడుతున్నాయని..'జగనన్నే మా భవిష్యత్తు, నమ్మకం' అని ప్రజలు అంటున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. శుక్రవారం పెదపలకలూరు గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు ప్రచార కార్యక్రమాన్ని జేసీఎస్ రీజినల్ కో–ఆర్డినేటర్ కందుల రవీంద్రారెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే సుచరిత మాట్లాడుతూ.. ఈ నెల 20వ తేదీ వరకూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు కేవలం తమ వర్గానికి మాత్రమే న్యాయం చేసి, పేదలను, బడుగు బలహీన వర్గాలను దోచుకున్నారని విమర్శించారు. జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత కులం, మతం పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాయని గుర్తు చేశారు. ఎంతో పారదర్శకంగా వలంటీర్ల ద్వారా ప్రతి ఇంటికీ తిరిగి పెన్షన్లు, ఇతర పథకాలను అందిస్తున్నట్లు వివరించారు. గృహ సారథులు, సచివాలయం కన్వీనర్లు, వలంటీర్లు తమకు కేటాయించిన ప్రతి ఇంటికీ వెళ్లి.. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, సమస్యలు తెలుసుకుని పరిష్కారం చూపే దిశగా కృషిచేయాలని చెప్పారు. ప్రతి రోజు 10–15



సంక్షేమ లబ్ధి చేకూరిన మహిళ ఆత్మీయ పలకరింపుతో..

కుటుంబాలను కలిసి, అభిప్రాయాలను తెలుసుకుని, వారికి ఇష్టమైతే 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లు ఇంటి తలుపులకు అంటించాలని తెలిపారు. నాడు – నేడు పాలనలో వ్యత్యాసాన్ని వివరించాలని దిశానిర్దేశం చేశారు. జగన్న ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసినట్లు వివరించారు. జెడ్పీటీసీలు తుమ్మల సుబ్బారావు, గుల్జార్ బేగం, వైస్ ఎంపీపీ దర్శి సుజాత, మండల కన్వీనర్లు ఆళ్ళ రవిదేవరాజు, గట్టు విజయ్‌కుమార్, ఆర్ అండ్ బి కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, జేసీఎస్ మండల కన్వీనర్లు దారం అశోక్‌కుమార్, పిల్లి నాగేశ్వరరావు, ఎదురుపాక వెంకట్, కార్పొరేటర్లు ఏరువ సాంబిరెడ్డి, శ్యామల వెంకట రమణాదేవి బ్రహ్మారెడ్డి, బి.స్మిత పద్మజ, సర్పంచ్‌లు డబ్బూరి సూర్య ప్రకాశరావు, నల్లమేకల మాధవరావు, రాంజీ అంబేడ్కర్, ఏరువ జగన్‌మోహన్‌రెడ్డి, డివిజన్ ఇన్‌చార్జ్‌లు అరిక శ్రీనివాసరెడ్డి, పెద్దింటి రామకోటి, సొసైటీల చైర్మన్లు తంగెళ్ళ నాగేశ్వరరావు, నాగం కాశీవిశ్వనాథం, సోషల్ మీడియా కన్వీనర్ పుట్టా బాజీ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ముత్యాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తు తీర్చిదిద్దే ముఖ్యమంత్రి

- గత, ప్రస్తుత ప్రభుత్వాల వ్యత్యాసాలు ఇంటింటికీ వివరణ..
- ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధిపై విస్తృత స్థాయి ప్రచారం
- జగనన్న పాలనపై దృఢ నమ్మకం కలిగిన ఇంటికి స్టిక్కర్లు
- 'మా నమ్మకం నువ్వే జగన్' ప్రచారంలో ప్రజల సంతృప్తికర స్పందన



కర పత్రాన్ని అందజేస్తున్న జేసీఎస్ మండల కన్వీనర్ తదితరులు



లబ్ధిదారులతో కన్వీనర్లు, గృహ సారథులు

గుంటూరు రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో సంతోషంగా జీవిస్తున్నామని ప్రజలు చెబుతున్నారని జేసీఎస్ మండల కన్వీనర్ ఎదురుపాక వెంకట్ తెలిపారు. శుక్రవారం చల్లావారిపాలెంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మెట్టు వెంకటప్పారెడ్డి, సర్పంచ్ ఆరుదల సాంబశివరావుతో కలిసి 'జగనన్నే మా భవిష్యత్తు' ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఇంటి పెద్దతో ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి గురించి మాట్లాడారు. సకాలంలో అందుతున్నాయో..లేదో.. తెలుసుకున్నారు. అనంతరం వారి అంగీకారంతో 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్‌ను అంటించారు. రానున్న కాలంలో మరలా జగనన్నే మా భవిష్యత్తు తీర్చిదిద్దేంకు ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరతున్నారని నాయకులు అంటున్నారు. కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్లు నాగుర్‌వలి, పాపిరెడ్డి తదితరులున్నారు.

కాకుమానులో విస్తృత ప్రచారం

కాకుమాను: కాకుమానులో శుక్రవారం 'జగనన్నే మా భవిష్యత్తు' ప్రచారం కార్యక్రమం సచివాలయాల మండల కన్వీనర్ పంగులూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ నాలుగేళ్ల నుంచి రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న ఏకైక నాయకుడు, పేద ప్రజల మన్ననలు పొందుతున్న సేవకుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. రాష్ట్రంలో ఏ మారుమూల గ్రామానికి వెళ్లినా.. జగనన్న పాలన మరలా రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజా మద్దతు పుస్తకంలో పొందుపరచిన ఐదు ప్రశ్నలకు సమాధానాలను ప్రజల నుంచి తెలుసుకున్నారు.

రాష్ట్రంలో సంక్షేమ శకం

ప్రత్తిపాడు: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో సంక్షేమ శకం నడుస్తోందని సచివాలయాల మండల కన్వీనర్ వేలూరి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కొండేపాడు గ్రామంలో శుక్రవారం రాత్రి మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ విప్పాల కృష్ణారెడ్డి, ఎంపీపీ దాసరి అన్నమ్మ హాజరయ్యారు. ఇంటింటికీ వెళ్లి మా నమ్మకం నువ్వే జగన్ కర పత్రాలు పంపిణీ చేసి, స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రజలంతా నిన్ను నమ్మం బాబూ అంటూ టీడీపీకి మరోసారి బుద్ధి



కర పత్రాలు అందజేస్తున్న, కన్వీనర్ లక్ష్మారెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు విప్పాల

చెప్పేందుకు సిద్ధమయ్యారన్నారు. జెడ్పీటీసీ విప్పాల కృష్ణారెడ్డి మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి మాట ఇస్తే మడమ తిప్పే వ్యక్తి కాదన్నారు. గ్రామ సచివాలయ కన్వీనర్లు, నాగరాజు, రత్నబాబు, సర్పంచ్ నర్రా రాంబాబు, మాజీ మండల కన్వీనర్ గట్టు విజయ్, రైతు విభాగం జిల్లా కన్వీనర్ ఉడుతూరి ఓం ప్రకాష్ రెడ్డి, సేవాదళ్ జిల్లా కన్వీనర్ ఉద్దగిరి మురళి, పార్టీ నాయకులు జి.శివారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రామారావు, జనార్దన్ పాల్గొన్నారు.

మానవాళి పాప విముక్తి ద్వారం..
ఏసుక్రీస్తు సిలువ మార్గం



ఏసుక్రీస్తు సిలువ మరణం ప్రదర్శనలో ఓ దృశ్యం



రావిపాడులో ఏసుప్రభు వేషధారణలో సిలువధారి ప్రదర్శన

- భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే వేడుకలు
- ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

పెదకాకాని: మానవాళికి మెండుగా లోక రక్షకుని ఆశీర్వాదాలు అందాలని పాదర్ రెవరెండ్ పూదోట నవీన్ అన్నారు. గ్రామాల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు భక్తిశ్రద్ధలతో భక్తులు జరుపుకున్నారు. నంబూరు ఏసు పవిత్ర హృదయ పుణ్యక్షేత్రం ఆర్‌సీఎం చర్చ్‌లో ఏసు సిలువ మార్గం 14 స్థలాల్లో ఏసు ప్రభువు మానవాళి కోసం అనుభవించిన కష్టాలను, బాధలను దృశ్య రూపకంగా విశ్వాసులు ప్రజలకు వివరించారు. గ్రామంలోని 14 స్థలాల్లో పాదయాత్ర ద్వారా ప్రదర్శన నిర్వహించారు. ప్రభువు వాక్యాలు తెలియ జేసేలా పుర వీధుల్లో ప్రదర్శన సాగింది. సిలువ మార్గం అనంతరం రెవరెండ్ పూదోట నవీన్ ప్రార్థన నిర్వహించారు. అనంతరం చర్చి ప్రాంగణంలో వెయ్యి మంది విశ్వాసులకు, దీక్షాపరులకు, సంఘ సభ్యులకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు. చర్చి కన్వీనర్ డాక్టర్ కూచిపూడి మోహన్‌రావు మాట్లాడారు. ఈ కార్యక్రమాలకు సహకరించిన సంఘ విశ్వాసులకు, దీక్షాపరులకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. పెద్దలు డికన్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు. పెదకాకాని అంబేడ్కర్ నగర్ చర్చిలో జమీల్ అహ్మద్ బేగ్ మానవాళికి ఏసు ప్రభువు ఇచ్చిన సందేశాన్ని వివరించారు. ద్వేషం, కక్షలకు తావు లేకుండా.. ప్రేమ, క్షమాగుణాలతో జీవించాలన్న ఏసు ప్రభు బోధనలను మననం



నంబూరు ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న విశ్వాసులు

చేసుకుందామన్నారు. ఈ సందర్భంగా పాస్టర్ జక్రయ్య, పాస్టర్ ఎలీషాను జమీల్ అహ్మద్ బేగ్ శాలువాలతో సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

కాకుమాను: గ్రామాల్లోని చర్చిల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక ఆంధ్ర ఇవాంజలికల్ లూథరన్ పరిశుద్ధ దేవాలయంలో పాస్టర్.. ఏసు క్రీస్తు మరణం గురించి వివరించారు. క్రీస్తు ఏసు సిలువధారణ సమయంలో పలికిన ఏడు మాటల గురించి వివరించారు. నలభై రోజుల నుంచి ఉప వాసాలతో ఉన్న క్రైస్తవులు శుభ శుక్రవారంతో విరమించారు. అధిక సంఖ్యలో క్రైస్తవ భక్తులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని, దేవ దేవునికి స్తుతులు చెల్లించారు.



ఆర్‌సీఎం చర్చి ఆవరణలో ఏసుక్రీస్తు సిలువ మరణం ప్రదర్శన

పాపులను రక్షించుటకు.. ఏసుక్రీస్తు సిలువ మరణం

పెదనందిపాడు: పాపులను రక్షించుటకు క్రీస్తు సిలువ మరణం పొందారని పాస్టర్ కెనడీ పేర్కొన్నారు. శుక్రవారం గుడ్‌ఫ్రై డే సందర్భంగా చర్చిల్లో క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ కెనడీ సిలువ సమయంలో ఏసు ప్రభువు చెప్పిన సప్త సూక్తులను విశ్వాసులకు వివరించారు. అన్ని చర్చిల్లో ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ప్రతి ఒక్కరూ తమ పాపాలను ఏసు వద్ద చెప్పుకొని విముక్తి పొందాలని సందేశమిచ్చారు. కత్రపాడు, రావిపాడు గ్రామాల్లో సిలువధారి నాటకం ప్రదర్శించారు. ఈ ప్రార్థనల్లో క్రైస్తవ సోదరులందరూ పాల్గొని, ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ప్రభుత్వంపై సంతోషకర ప్రజా స్పందన

ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే కిలారి



'మా నమ్మకం నువ్వే జగన్' ప్రచారంలో ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య

పొన్నూరు(చేబ్రోలు): ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పరిపాలనపై ప్రజల నుంచి సంతోషకరమైన స్పందన రావడం అభినందనీయమని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య పేర్కొన్నారు. పొన్నూరులోని 1వ సచివాలయ పరిధిలో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. వార్డులో స్వయంగా ప్రతి ఇంటికీ వెళ్లి.. ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సేవలు, మేలు గురించి ప్రజలకు తెలియజేశారు. సంతృప్తి వ్యక్తం చేసిన వారి ఇంటికి..అనుమతితో స్టిక్కర్లను అంటించారు. కుటుంబ పెద్ద మొబైల్ నుంచి కేటాయించిన నంబరుకు మిస్డ్‌కాల్ ఇప్పించారు. ప్రచారంలో ప్రజల నుంచి ప్రభుత్వానికి అనుకూలంగా వస్తున్న సమాధానాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ శాఖ డైరెక్టర్ దాసరి నారాయణరావు, పొన్నూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి డైరెక్టర్ బొద్దులూరి రంగారావు, పొన్నూరు రూరల్ కన్వీనర్ భవనం వంశీ రెడ్డి, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ అమెరినేని సాంబశివరావు, ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ భీమవరపు విజయలక్ష్మి, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఈద్గా అభివృద్ధి పనులు



ఈద్గాలో పనులను పరిశీలిస్తున్న మాజీ ఎంపీటీసీ షేక్ నజీర్ అహ్మద్

పెదకాకాని: పెదకాకాని గ్రామంలోని పాతూరు ఈద్గా అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గత ప్రభుత్వంలో అనేక సార్లు ఈద్గా అభివృద్ధికి అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించుకున్నప్పటికీ ప్రయోజనం లేదు. ఈ సమస్య తెలిసిన వెంటనే పాతూరు ప్రాంతంలో ముస్లిం శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు ఎంపీ ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి తన గ్రాంట్స్ నుంచి రూ.7 లక్షలు మంజూరు చేశారు. మండల పరిషత్ నుంచి మరో రూ.3 లక్షలు విడుదలయ్యాయి. ఈ నిధులతో ఈద్గాకు ఇరు వైపులా ప్రహరీ, గేట్లు, సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు. పంచాయతీరాజ్ అధికారులు పర్యవేక్షణలో నాణ్యతా ప్రమాణాలతో కూడిన పనులు జరుగుతున్నాయని శుక్రవారం ఎంపీటీసీ సభ్యురాలు షేక్ గుల్జార్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు షేక్ నజీర్ అహ్మద్, అలీ, బాజి తెలిపారు. ముస్లింలకు ఉపయోగకరంగా ఉండే విధంగా పనులు చేపట్టిన ప్రభుత్వానికి, అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడులు

- ఆరుగురు నిర్వాహకులు, 5 సెల్‌ఫోన్లు, 3 బైక్‌లు స్వాధీనం
- స్వర్ణపురి కాలనీలో 8 మంది పేకాట జూదరుల అరెస్ట్



స్వర్ణపురికాలనీలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

పెదకాకాని: స్థానిక పోలీసులు శుక్రవారం కోడి పందేలు, పేకాట స్థావరాలపై విస్తృతంగా దాడులు నిర్వహించారు. తక్కెళ్ళపాడు శివారులో కోడి పందేల స్థావరంపై ముందస్తు సమాచారంతో దాడి చేసి.. ఆరుగురు కోడి పందేల నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఐదు సెల్ ఫోన్‌లు, మూడు బైక్‌లు, రూ.32,070ల నగదు, ఒక పందెం కోడి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

పేకాట జూదరుల అరెస్ట్..

పెదకాకాని స్వర్ణపురి కాలనీలోని ఓ ఇంటిలో పేకాట ఆడుతున్న ఎనిమిది మంది జూదరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.9,980 నగదు, ఆరు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు చేసినట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు. దాడులు నిర్వహించిన ఎస్ఐ రాంబాబు, సిబ్బందిని సీఐ అభినందించారు.

విద్యాభివృద్ధికి ఏఎన్‌యూ పూర్వ విద్యార్థుల కృషి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులకు మార్గదర్శనం చేసేందుకు పూర్వ విద్యార్థులుగా తమ వంతు కృషి చేస్తున్నామని ఆదాయపు పన్ను శాఖ విశ్రాంత జాయింట్ కమిషనర్, ఏఎన్‌యూ పూర్వ విద్యార్థి తెలగారెడ్డి సత్యానందం పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో 1978–80, 1979–81 బ్యాచ్‌లలో ఎంకాం, ఎంబీఏ చదివిన పూర్వ విద్యార్థులు శుక్రవారం గుంటూరు బ్రాడీపేటలోని ఓ హోటల్లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సత్యానందం మాట్లాడుతూ 42 ఏళ్ల తరువాత గత నెల 18న కలుసుకున్నామని చెప్పారు. కాగా గత సమావేశానికి హాజరు కాలేకపోయిన పూర్వ విద్యార్థుల్లో పలువురు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి సమావేశమయ్యారని వివరించారు. ఏఎన్‌యూ విద్యాభివృద్ధిలో పూర్వ విద్యార్థులుగా తమ వంతు సహాయ, సహకారాల్ని అందించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఏఎన్‌యూ ఎంకాం, ఎంబీఏ చదువుతున్న విద్యార్థులకు భవిష్యత్ ప్రణాళికలపై మార్గదర్శనంతో పాటు పేద విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, పలు కార్యక్రమాల్ని చేపట్టేందుకు నిర్ణయాల్ని తీసుకున్నట్లు చెప్పారు. పూర్వ విద్యార్థులు జి. ప్రసాద్, జి.ఎన్. బ్రహ్మానందం పాల్గొన్నారు.

న్యాయవాదుల సంక్షేమానికి కట్టుబడిన సీఎం వైఎస్ జగన్

వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం జిల్లా అధ్యక్షుడు సీడీ భగవాన్



పట్నంబజారు: న్యాయవాదుల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం జిల్లా అధ్యక్షుడు సీడీ భగవాన్ చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుదీర్ఘ పాదయాత్రలో న్యాయవాదుల సమస్యలు తెలుసుకున్న సీఎం వై.ఎస్. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత అనేక కార్యక్రమాల్ని చేపట్టారని తెలిపారు. న్యాయవాదుల సంక్షేమ నిధికి రూ. 100 కోట్లు కేటాయించడంతో పాటు వృత్తిని నమ్ముకుని వచ్చిన జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్ కింద రూ 5వేలు అందజేసిన ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు. న్యాయవాద రంగంలో ఉన్న ప్రతి ఒక్కరికీ చిత్తశుద్ధితో మేలు చేస్తున్నారని పేర్కొన్నారు. అన్ని సామాజికవర్గాలకు సముచిత న్యాయం జరిగేలా జీపీలు, పీపీలు, ఏపీపీలు వంటి ఎన్నో పదవులను అందజేశారని వివరించారు. ఈ క్రమంలో శనివారం బృందావన్ గార్డెన్స్‌లోని ప్రాంతీయ కార్యాయలంలో జరిగే ''జగనన్న పాలనలో న్యాయ సంస్కరణలు'' కార్యక్రమానికి జిల్లాలోని న్యాయవాదులు హాజరుకావాలని ఆయన కోరారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, లీగల్ విభాగం ప్రతినిధులు, రాష్ట్ర నేతలు హాజరవుతారని పేర్కొన్నారు.

ఆయుర్వేదంలో అన్ని వ్యాధులకు చికిత్స



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రామారావు, వైద్యులు

గుంటూరు మెడికల్ : కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో ఆయుర్వేద వైద్యం ప్రజలకు కొండంత అండగా నిలబడిందని దేశీయ వైద్య సంఘం గుంటూరు నగర శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.వి.రామారావు తెలిపారు. వరల్డ్ హెల్త్ డే సందర్భంగా శుక్రవారం స్థానిక అరండల్‌పేటలోని సంఘ కార్యాలయంలో సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామారావు మాట్లాడుతూ ఎలాంటి వ్యాధులకైనా ఆయుర్వేదంతో చెక్ పెట్టవచ్చని తెలిపారు. పలు రకాల రుగ్మతల నివారణకు మన ప్రాచీన ఆయుర్వేద వైద్యం ప్రత్యేక గుర్తింపు పొందిందని వెల్లడించారు. ఆయుర్వేదంపై ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం దేశీయ వైద్య సంఘం తరఫున భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టి మందులపై ప్రజల్లో అపోహల్ని తొలగిస్తామని తెలిపారు. సమావేశంలో ఆయుర్వేద వైద్యులు ఎస్. శ్రీనివాసరావు, కృష్ణదాసి, ఎస్.కె.హసీనా, శివ సూర్యనారాయణ పాల్గొన్నారు.